

## నూతన వధూవరులను ఆశీర్వదించిన  ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**టి మీడియా, మార్చి 5,హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం సాక్షితో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి  హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి కాసేపు గడిపారు.


ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 40
సంచిక : 164
పేజీలు : 3

శుక్రవారం, మార్చి 06, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


# ఆపదొస్తే.. పరుగు, అవస్థలు ఉండవు

### -మంత్రి  పొంగులేటి శ్రీనివాస రెడ్డి

### -100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన




**టీ మీడియా, మార్చి 5 , పాలేరు ప్రతినిధి:** తిరుమలాయపాలెం : అర్ధరాత్రి వేళ ఆపద వస్తే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఖమ్మం పరుగు తీయాల్సిన కష్టాలు ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు ఇక ఉండవు. పేదవాడి సొంత గడ్డపైనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి  పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**జిల్లా ఆసుపత్రిని మరిపించేలా**

గతంలో కేవలం 30 పడకలతో, అరకొర వసతులతో ఉన్న ఈ ఆసుపత్రి వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులను మంత్రి గుర్తు చేసుకున్నారు. "నాడు ప్రసవం కావాలన్నా, అత్యవసర చికిత్స కావాలన్నా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం వచ్చాక, జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిని మరిపించేలా ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం. డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యాన్ని రాబోయే కొద్ది నెలల్లోనే ఇక్కడ అందుబాటులోకి తెస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వైద్యులు దేవుళ్లతో సమానం**

వైద్య సిబ్బంది పనితీరుపై మంత్రి  దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి భవనాలు కట్టవచ్చు.. కానీ డాక్టర్ అందుబాటులో ఉంటారనే నమ్మకం రోగికి కలిగినప్పుడే ఆ ఆసుపత్రికి సార్థకత ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది ఎక్కడో ఉండటం కాదు.. ఈ హెడ్ క్వార్టర్స్‌లోనే నివసించాలి. చర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కూడా అదే అంకితభావం కావాలి. విధుల్లో చిత్తశుద్ధి చూపే సిబ్బందికి నా నియోజకవర్గం తరపున ప్రత్యేక బహుమతులు అందజేస్తాను" అని ప్రకటించారు.

**విద్య, వైద్యమే మా ప్రభుత్వ అజెండా**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  నాయకత్వంలో పేదవాడికి నాణ్యమైన చదువు, వైద్యం అందించడమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. "కేవలం వైద్యమే కాదు.. రాబోయే రోజుల్లో విద్యారంగంలోనూ విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. గడిచిన రెండేళ్ల మూడు నెలల కాలంలోనే మౌలిక వసతుల కల్పనలో మనం ఎంతో పురోగతి సాధించాం. ఈ ప్రభుత్వం ఎవరినీ నొప్పించదు.. కానీ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలి" అని స్పష్టం చేశారు.



### కాంట్రాక్టర్ కి ఆదేశాలు

"మార్చిలో పనులు మొదలవుతున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మళ్లీ డిసెంబర్ నాటికే ఈ ఆసుపత్రిని ప్రారంభించాలి" అని గడువు విధించారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ?ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు , మండల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**టి మీడియా, మార్చి 5 , ఖమ్మం రూరల్ :**విద్యార్థులు ఏలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్ రోడ్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికల) ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, పరిసరాలను తిరుగుతూ, మౌళిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, కోడిగుడ్డులు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి రికార్డు లెక్కలను క్షుణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న కామన్ మెనూ ప్రకారం వండుతున్న ఆహారం అన్నం, కూరలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి, మెస్ కమిటీ వ్యవహారాలపై వివరాలు అడిగి తెలుసుకుని, కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూకు అనుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గది సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఏలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని హితబోధ చేస్తూ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి విద్యార్థులు చదువు పై దృష్టి పెట్టి పరీక్షలకు హాజరు కావాలని, పరీక్షలకు మరో 9 రోజులు ఉందని, ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మనం ఎంత సమయం చదువుతున్నాం అనే దానికంటే ఎంత శ్రద్ధగా చదువుతున్నా మనేది చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ పరీక్షలకు

మిగతా 3లో

# రూ.4 లక్షల సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు

### వ్యవసాయ అధికారి వినయ్ కుమార్



**టి మీడియా, మార్చి 5,బోనకల్:**తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కాకుండా సాగులో లేటెస్ట్ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు డ్రోన్లను 40 శాతం సబ్సిడీ తో రైతులకు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్ కుమార్ విలేకరులకు తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లోని బోనకల్ మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు శ్రమ తగ్గించి, దిగుబడి పెంచడమే ఈ పథకం వెనుక ఉన్న ముఖ్య లక్ష్యం అన్నారు. ఒక్కో డ్రోన్ కొనుగోలుపై 40 శాతం సబ్సిడీ లేదా గరిష్టంగా రూ.4 లక్షల వరకు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో  మొదటి విడతలో భాగంగా మధిర డివిజన్ లో రెండు డ్రోన్లను సబ్సిడీ తో ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నేరుగా రైతులకే కాకుండా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలకు, మహిళా సంఘాలకు  మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల తో పొలాల్లో పురుగుమందులు, సూక్ష్మ పోషకాలను పిచికారీ చేయడానికి కేవలం నిమిషాల్లోనే ఆ పని పూర్తి చేయవచ్చు అని తెలిపారు. దీనివల్ల సమయం దాదాపు 80 శాతం వరకు ఆదా అవుతుందన్నారు. అంతేకాకుండా మందులు పంట అంతటా సమానంగా పడటం వల్ల పురుగుల ఉధృతి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. కూలీల కోసం వెతకాల్సిన అవసరం లేకుండా ఖర్చు కూడా భారీగా తగ్గుతుందన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే రైతులు తమ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి  కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చెయ్యవచ్చునని తెలిపారు. అక్కడ సబ్సిడీ శాతం, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని

మిగతా 3లో



## 99 రోజుల కార్యాచరణపై సమావేశము

**టి మీడియా, మార్చి 5,అశ్వారావుపేట** :ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా తెలంగాణా ప్రభుత్వము మునిసిపాలిటీ లలో చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై గురువారం చైర్ పర్సన్ జూపల్లి శశికళ అధ్యక్షతన కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో మునిసిపల్ కమీషనర్ బి. నాగరాజు మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళిక లో భాగంగా మార్చ్ 6 నుండి ఈ నెల 15 వరకు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సూచించారు.10 రోజుల పాటు నిర్వహించే పరిశుభ్రత కార్యక్రమాలలో ప్రధానంగా ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త సేకరణ, మురికి కాలువల పూడికతీత తో పాటు, పలు కార్యక్రమములు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయనున్నట్లు కమీషనర్ తెలిపారు.అందుకు ప్రజలను అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములను చేసి చైతన్యం నింపాలని కౌన్సిలర్లకు సూచించారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబుతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి పంపిణీ

**- మంచి ఫలితాలు సాధించాలి**

**- లయన్ కోటగిరి సీతారామ స్వామి**

**టి మీడియా, మార్చి 5,అశ్వారావుపేట** :విద్యార్థులు ఇష్టం తో చదివి, ఉత్తమ ఫలితాలను సాధించి తల్లిదండ్రులు కు మంచి పేరు తేవాలని పదో తరగతి విద్యార్థులకు లయన్ కోటగిరి సీతారామ స్వామి సూచించారు. లయన్స్ క్లబ్ అశ్వారావుపేట విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక జడ్పీహెచ్ఎస్ లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు లయన్ కోటగిరి సీతారామస్వామి ఆర్థిక సహకారం తో లైన్స్ క్లబ్ తరపున పరీక్ష ప్యాడ్స్, పెన్స్ అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని,పరీక్షల్లో అందరూ మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. పాఠశాలకు ఏ విధమైనటువంటి సహాయ సహకారాలు కావాలన్నా లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో జల్లిపల్లి కొండ ,పుల్లారావు, చీమకుర్తి చక్రధరం, కంచర్ల రామారావు, జూపల్లి బ్రహ్మారావు, కోటగిరి మోహన్ రావు, బలమూరి సూర్య రావు, పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలు డంప్ యార్డుకు తరలింపు



**టి మీడియా, మార్చి 5,దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్రంలో వీధి కుక్కలుస్వైరవిహారం చేస్తుండటంతో వీధి కుక్కల బెడదకు అడ్డుకట్ట వేసేందుకు గురువారం గ్రామ పంచాయతీ నడుం బిగించింది. కుక్కలను పట్టుకోవడంలో నైపుణ్యం కలిగిన నిపుణులను ఖమ్మం నుంచి రప్పించి, ప్రత్యేక ఆపరేషన్ను ప్రారంభించారు. ఈ ప్రత్యేక బృందం ఆధునిక వలలు, పరికరాలను ఉపయోగించి సురక్షితంగా బంధిస్తున్నారు. గ్రామ వీధుల్లోని కుక్కలను చాకచక్యంగా వెంబడించి పట్టుకుంటున్నారు.పట్టుకున్న కుక్కలను ప్రత్యేక వాహనాల్లోకి ఎక్కించి సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు. దమ్మపేట గ్రామస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అనంత్ కుమార్, పాలకవర్గం తీసుకున్న ఈ నిర్ణయం పై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలు చిన్నపిల్లల దగ్గర్నుండి ముసలి వాళ్ళ వరుకు తరచూ గాయపరచడం, వాహనదారులను వెంబడించి ప్రమాదాలకు కారణం అవుతున్న వీధి కుక్కలను పట్టుకుని కోదాడ కుక్కల డంప్ యార్డులకు తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుండి కోతులను వదులుతున్నట్లు, కుక్కలను కూడా ఈ ప్రాంతాలలో వదులుతున్నారని వారి పట్ల నిఘా ఉంచినట్లు పంచాయితీ పాలకవర్గం తెలిపింది. అటువంటి వారు ప్రజలకు తారసపడితే వారిని అడ్డగించి పంచాయితీ అధికారికి, పాలక వర్గానికి సమాచారం అందించాలని కోరారు.

# సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె

**-ఏఐటీయూసీ కేంద్ర కమిటీ**

**టి మీడియా, మార్చి 5,రుద్రంపూర్** :సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు అన్నారు. గురువారం గోదావరిఖనిలో జరిగిన ఏఐటియుసి కేంద్ర కమిటి సమావేశంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ....సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటియుసితో నవంబర్ 2024 , మార్చి 2025లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో పలు డిమాండ్ లను అంగీకరించి అమలు చేయడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా స్వంత ఇంటి పథకాన్ని, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ చెల్లింపులపై సర్క్యులర్లను జారీ చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని ఆరోపించారు.ఏసీబీ కేసుతో సంబంధం లేకుండా మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలి. మెడికల్ బోర్డు ను ఏసీబీ విచారణ పేరుతో నిలిపి వేశారని వారు ఆరోపించారు. అనారోగ్యం వల్ల కార్మికులు చాలా మంది మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు కు పిలువ కుండా కాలయాపన చేస్తూ కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వారికి ఉద్యోగాలు రావడం లేదని వారు ఆరోపించారు. జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల నుంచి జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దానిని వెంటనే రద్దు చేసి రికవరీ చేయొద్దని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి కొత్త గనులు ఇవ్వకుండా తెలంగాణ లో ఉన్న సింగరేణి సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. వేలంతో సంబంధం లేకుండా తెలంగాణ లో ఉన్న కొత్త గనులు సింగరేణి కి కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి లో మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్ మెన్ ల సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని,




లేకుంటే సమ్మె కు పిలుపునిస్తామని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లా గౌడ్, కే.వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు అక్బర్ అలీ, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, బ్రాంచ్ కార్యదర్శులు బాజీ సైదా, మల్లికార్జున్, రాంగోపాల్, రమేశ్, తిరుపతి, మల్లేష్, జీగురు రవిందర్, ఎం.ఆర్.సి రెడ్డి, రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## చిన్నక్క ఆశయాలు అజరామరం

**వర్ధంతి సభలో మచ్చ వెంకటేశ్వర్లు,**

**టి మీడియా, మార్చి 5,చర్ల:** మాజీ వైస్ ఎంపిపి, సిపిఎం మండల కమిటీ సభ్యురాలు అమరజీవి కుంజ చిన్నక్క ఆశయాల సాధనకు ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కుంజ చిన్నక్క ఆరవ వర్ధంతి ఆర్ కొత్తగూడెం సెంటర్లో కారం నరేష్ అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కుంజ చిన్నక్క స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుంజ చిన్నక్క సిపిఎం పార్టీ నిర్వహించిన అనేక ప్రజా పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు, పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశారని అన్నారు, ఆర్ కొత్తగూడెం ఎంపీటీసీ గా గెలుపొంది చర్ల మండల ఉపాధ్యక్షురాలుగా ఆదర్శవంతంగా నీతి నిజాయితీగా ప్రజా సేవ చేసిన గొప్ప నాయకురాలని ఆయన కొనియాడారు, చిన్ననాటి నుంచి చిన్నక్కకు సిపిఎం పార్టీ పట్ల అమితమైన ప్రేమ, గౌరవం ఉండేదని అన్నారు ,డబ్బుకు, పదవులకు లొంగని క్రమశిక్షణ కలిగిన నాయకురాలని అన్నారు, అనారోగ్యంతో ఆమెను కోల్పోవడం పార్టీకి, కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు,ఆమె మరణించినా చిన్నక్క ఆశయాలు అజరామరమని ఆమె చూపిన మార్గంలో ఉద్యమాలు నిర్వహిండమే చిన్నక్కకిచ్చే ఘన నివాళి అని అన్నారు.

## సిఎస్ఆర్ నిధులను అభివృద్ధికి

## బీటీపిఎస్ లో స్థానికులకు ఉపాధి



**-సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్**

**టి మీడియా, మార్చి 5,మణుగూరు:** భద్రాద్రి పవర్ ప్లాంట్ బాధ్యత సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి వెచ్చించి, గ్రామాల సమూల అభివృద్ధికి సహకరించాలని, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టర్ మణుగూరు పర్యటన సందర్భంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మధుసూద న్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, బీటీపిఎస్ లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, పవర్ ప్లాంట్ సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు విద్యా, వైద్యం, విద్యుత్తు, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్లాంట్ నిర్మాణం కోసం నిర్వాసిత గ్రామాల ప్రజలు భూములు ఇచ్చి,నేడు దాని నుండి వెలువడే కాలుష్యాన్ని భరిస్తూ, ఇబ్బంది పడుతుంటే, నిర్వాసిత గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించాల్సిన సిఎస్ఆర్ నిధులను అభివృద్ధికి ఉపయోగించ కుండా, బయటి ప్రాంతాలకు తరలించడంతో నిర్వాసిత గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధి పై దృష్టి పెట్టాలని, నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. సిఎస్ఆర్ నిధుల వినియోగం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే, పార్టీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే అందర్నీ కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## నూతన వధూవరులకు

## మంత్రి పొంగులేటి ఆశీర్వాదం

**టీ మీడియా, మార్చి 5 ,ఖమ్మం :** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తన నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు పట్టు వస్త్రాలను కానుకగా అందించి, వారు “నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో చల్లగా ఉండాలి” అని దీవించారు.కూసుమంచి మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో జరిగిన బోనగిరి వెంకటేశ్వరరావు కుమారుని వివాహ వేడుకకు మంత్రిహాజరైవధూవరులనుఆశీర్వదించారు.ఖానాపురంలోని మొగిలి పాపిరెడ్డి కన్వెన్షన్ హాల్లో ఇంటూరి పుల్లయ్య కుమారుని పెళ్లికి, ఖమ్మం బైపాస్ రోడ్డులోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో ఎంపీఓ చిప్పా శివ కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు.ఏదులాపురంలో జరిగిన మద్దినేని అశోకరావు కుమారుని వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు పట్టువస్త్రాలు బహూకరించారు.ఏన్కూరు డ తల్లాడ ఏన్కూరు మండలం నాచారంలో ముక్తి వెంకటేశ్వర్లు కుమారుని వివాహానికి, తల్లాడ మండలం కుర్నవల్లిలో అయిలూరి శ్రీనివాసరెడ్డి కుమారుని వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను దీవించారు.

## దురాక్రమణ దాడులను ఖండించండి

**- ఎన్.వి. రాకేష్**




**టీ మీడియా, మార్చి 5 కామేపల్లి:** ఇరాన్ పై అమెరికా మరియు ఇజ్రాయిల్ దేశాలు సాగిస్తున్న అమానుష దాడులను నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) కామేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం, నాడు పండితాపురం గ్రామంలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ నిరసనను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.వి. రాకేష్ మాట్లాడరు. తక్షణమే దాడులను నిలిపివేయాలని, భారత ప్రభుత్వం కూడా ఈ నరమేధాన్ని ఖండించాలని వారు డిమాండ్ చేశారు.ఈ ?నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు చల్ల రాజు, రాయల నాగేశ్వరరావు, బత్తుల బిక్షం, బత్తుల వెంకన్న, చల్లా చిన్నమ్మాయి, చల్ల సీతమ్మ, నాగేశ్వరరావు, నాగులు తదితరులు పాల్గొన్నారు.

# 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

## -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**టీ మీడియా, మార్చి 5,ఖమ్మం:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు గ్రామ, పట్టణంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలుపై గురువారం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని అన్నారు. మార్చి 6న ఉదయం 10 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు, మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుద్ధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ అంశాలపై ప్రాధాన్యత తో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్ తొలగించాలని, దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఉన్న ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని, ఉదయం డిఎల్ పిఒ, ఎంపిఒ, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమీషనర్ ఫీల్డ్ లెవల్ లో తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడా రోడ్లపై చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, మేయర్ వంటి ప్రజాప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. పబ్లిక్ ప్లేసెస్ లో పారిశుద్ధ్యానికి పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, పట్టణాలలోని కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని, దీనికి ప్రతి ఒక్కరు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ముగిసే నాటికి ఖమ్మం జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్లు పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఇంచార్జి మంత్రి వర్యుల ఆధ్వర్యంలో జరిగే సన్నాహక కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా విద్యా శాఖ అధికారిణి చైతన్య జైని, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ బస్సు దిగిన చిన్నారికి ఆటో ఢీ

**టీ మీడియా, మార్చి 5 ,అశ్వాపురం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాఅశ్వాపురం మండలం, మొండికుంట నుంచి నెల్లిపాక బంజర వైపు వెళ్లే రోడ్డు మీద , మణుగూరు విజ్ఞాన్ స్కూల్ కి వెళ్ళి వస్తున్న మొండికుంట గ్రామ నివాసి పాటి కృష్ణ రెండవ కుమార్తె స్కూల్ బస్సు దిగి ఇంట్లోకి వెళ్ళుతున్న చిన్నారి కి ఎదురుగా వచ్చిన ఆటో తగిలిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల ప్రకారం ఆటో వాహనం చిన్నారికి ఢీకొట్టిందని చెబుతుండగా, ఆటో డ్రైవర్ మాత్రం తగలలేదని పేర్కొన్నాడు. ఆ చిన్నారి మొండికుంట ఘటన సమయంలో స్కూల్ బస్సులో క్లీనర్ లేకపోవడం గమనార్హం. చిన్నారులను దింపే సమయంలో బస్సు డ్రైవర్ ,క్లీనర్ తగు జాగ్రత్తలు మరింతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని , చాలా స్కూల్ యాజమాన్యాలు స్కూల్ బస్సులకు సరైన కండిషన్ లేకుండా , క్లీనరు లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్నారని ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తక్షణమే పాపను హాస్పిటల్ కు తీసుకు వెళ్ళారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని , క్లీనర్ లేకుండా, బస్సులు తగిన కండిషన్ లేకుండా నడుపుతున్న స్కూల్ యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత

బాగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి మెయిన్ పరీక్షల కంటే ముందు వీలైనంత మేర అధిక సంఖ్యలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాయాలని తెలిపారు. పరీక్షలు అధికంగా రాయడం వల్ల తుది పరీక్షలను ఎటువంటి ఒత్తిడి లేకుండా సులభంగా రాయగలుగుతామని అన్నారు. మనం చదివిన దానికంటే రాసిన అంశాలు అధికంగా గుర్తుండిపోతాయని కలెక్టర్ తెలిపారు. ఒత్తిడి ని అధిగమించేందుకు కొంత సమయం శ్వాస సంబంధిత వ్యాయామాలు, యోగా లాంటివి విద్యార్థులు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు నిద్రలేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దని, ప్రతి రోజు కనీసం 7 నుంచి 8 గంటల పాటు మంచి నిద్ర ఉండాలని తెలిపారు. బయట ఆహారం తీసుకోవద్దని, బయట ఎక్కువ తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని, ఆరోగ్యంగా ఉంటే చదువు మీద దృష్టి పెడుతామని కలెక్టర్ సూచించారు. మనం చదువు పై నమ్మకంగా ఉంటూ పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. నెల రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఏకాగ్రతతో సిద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసీవో జ్యోతి, ప్రిన్సిపాల్ కె. శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ డి. సంధ్యారాణి, ఉపాధ్యాయులు సిహెచ్. ఏల్లిశ్వరి, జి. సంధ్యారాణి, కె. విజయలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.4 లక్షల సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు

తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బోనకల్ మండలంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద కల్టీవేటర్లు, టైవాన్ స్ప్రేయర్స్, డిస్క్ హ్యారోస్,రోటవేటర్లు, గడ్డి చుట్టే యంత్రం, కేజ్ వీల్స్ సబ్సిడీ పై అందించనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు మండల వ్యవసాయ అధికారిని లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.



## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ అంకిత్

**టీ మీడియా, మార్చి 5, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్‌ను జిల్లా కోర్టు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

# కాలుష్యనీరు సరఫరా

## - ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా..?



**టీ మీడియా, మార్చి 5,మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం, శివలింగాపురం మున్సిపాలిటీ పరిధిలో సరఫరా అవుతున్న తాగునీరు మసకబారిన స్థితిలో ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇళ్లకు వస్తున్న నీరు మట్టి కలిసినట్లుగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇలాంటి నీటిని తాగడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కడుపునొప్పి, విరేచనాలు, జ్వరం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా, మంచినీరు సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంకులను వెంటనే శుభ్రపరచాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మట్టి, కాలుష్యాన్ని తొలగించి, క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా పైపులైన్ల లీకేజీలను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులను వెంటనే నివారించి, స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని శివలింగాపురం వాసులు మున్సిపాలిటీ అధికారులను హెచ్చరిస్తున్నారు.

# టీఎస్ యూటీఎఫ్ మూడు దశల పోరాటం

**టీ మీడియా, మార్చి 5, ఖమ్మం బ్యూరో**

కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ), పట్టణ గురుకులాల్లో (యూఆర్ఎస్) పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తాత్సార వైఖరికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో మూడు దశల పోరాటం చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా వేతనాలు సరిపడా లేవని తెలిపారు. గతంలో చేసిన అనేక పోరాటాల సందర్భంగా సర్వీస్ కండిషన్లకు సంబంధించి అధికారులిచ్చిన హామీలు అమలు జరగకపోవడం గమనార్హమన్నారు. గత సంవత్సరం 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన అంశాలు కూడా ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఎస్వోలను ప్రిన్సిపాల్స్ గా, పీజీసీఆర్టీలకు జేఎల్ గా, సీఆర్టీ / పీఈటీ / సీఆర్‌పీపీ లను ఎస్ఏ లుగా పరిగణించి కనీస మూలవేతనం చెల్లించాలని కోరారు. ఆరోగ్య భద్రత కల్పించడానికి హెల్త్ కార్డులు జారీ చేయాలని, కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలాదారీ డ్యూటీల నుండి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మూడు దశల పోరాటంలో భాగంగా మార్చి 9 సోమవారం రోజు పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో భోజన సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. మార్చి 16 సోమవారం జిల్లా కేంద్రాలు / డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని వివరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 20న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లోనే సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని, ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు (పీఏబీ) లో కనీస వేతనాలకు సరిపడా నిధులకు ప్రతిపాదనలు పంపించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.